పారదర్శకంగా పంట నష్టం అంచనా

- ప్రతి ఆర్బీకే పరిధిలో నలుగురు సభ్యులతో ఒక బృందం
- సమీక్షలతో దిశానిర్దేశం చేసిన మండలాధికారులు
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన, పారదర్శక జాబితాకు ఆదేశం
- ఈ నెల 18 లోపు ముగింపు, 26న తుది జాబితా ప్రదర్శన

మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టం అంచనాలు సిద్ధం చేసేందుకు అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకు ప్రతి ఆర్బీకేకు నలుగురు సభ్యులతో కూడిన ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. బృందంలో పంచాయతీ సెక్రటరీ, వీఏఏ లేదా వీహెచ్ఏ, వీఆర్వో, సర్వేయర్ ఉన్నారు. వీరితో మండలాధికారులు సమీక్షలు నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. నష్ట పరిహారం జాబితాలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాబితాలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సోమవారం నుంచే బృంద సభ్యులు క్షేత్ర స్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.


క్రాపలో పంట నష్టాన్ని నమోదు చేస్తున్న బృందం


పొన్నపల్లిలో పంట నష్టం నమోదు చేస్తున్న ఏవో బాలాజీ

కొల్లూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో పంట నష్టం నమోదును పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు వెంకటేశ్వరరావు, కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలో నష్టపోయిన పంటల వివరాలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన బృంద సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. బృందంలోని సభ్యులు ప్రతి పంట పొలానికి వెళ్లి అక్కడ పంట పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, నష్టం నమోదు చేయాలని సూచించారు. ఈ–క్రాప్ బుకింగ్ చేయించిన రైతుల పంటలను నమోదు చేయడంతో పాటు, చేయించుకోని రైతుల పంట నష్టం వివరాలను కూడా విడిగా నమోదు చేయాలన్నారు. తుపాను వచ్చే సమయానికి హార్వెస్టర్లతో కోత పూర్తి చేసి, ధాన్యం అమ్మకాలు చేపట్టిన, కుప్పలు వేసుకున్న పంటలను నమోదు చేయకూడదని స్పష్టం చేశారు. తడిచిన ధాన్యం, పొలం మీద ఉన్న పంట పడిపోయి 30 శాతానికి పైగా నష్టం ఏర్పడితే నమోదు చేయాలన్నారు. వరి పంటతో పాటు మినుము, అరటి, పసుపు పంటలను కూడా పరిశీలించి, నష్టం అంచనా తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. పంట నష్ట నమోదుకు మండలంలో నలుగురు సభ్యులతో కూడిన 16 బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ బృందాలు అవకతవకలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. పంట నష్టపరిహార నమోదు ప్రక్రియ ఈ నెల 18 లోపు ముగించాలన్న అధికారుల ఆదేశాలతో మండలంలోని 16 ఆర్బీకేల పరిధిలో నష్ట నమోదు బృందాలు పంట నష్ట నమోదు ప్రక్రియను ప్రారంభించాయి.

ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలి

నగరం: పంట నష్టం వాటిల్లిన ప్రతి రైతుకు పరిహారం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం పంట నష్ట పరిహా జాబితాను రూపొందించేందుకు నియమించిన అధికారుల కమిటీల సమావేశంలో ఎంపీపీ పాల్గొని, మాట్లాడారు. పంట పొలాలను పరిశీలించి, నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చూడాలన్నారు. నష్టపోయిన పంట పొలాలను గుర్తించేందుకు వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో కమిటీ వేసినట్లు వెల్లడించారు. తహసీల్దారు ఎం.ప్రమీల, వ్యవసాయాధికారి రమేష్ బాబు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రంగా నమోదు చేయాలి

కర్లపాలెం: మిచౌంగ్ తుపాను ప్రభావంతో నీట మునిగిన పంటల నష్టం వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని తహసీల్దారు కేశవనారాయణ రావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు పంట నష్టం నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను నమోదు చేసే అధికారులు రైతుల పాస్ బుక్, సీసీఆర్సీ కార్డుల జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఫోన్ నంబర్ తీసుకోవాలని చెప్పారు. ఏవో ఎం.సుమంత్‌కుమార్, ఏఈవో ధనలక్ష్మి, వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

నష్టం వివరాలు నమోదు

చెరుకుపల్లి: మిచాంగ్ తుపాను వలన జరిగిన పంట నష్ట అంచనాలు సక్రమంగా నమోదు చేయాలని తహసీల్దారు కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం పంట నష్ట అంచన నమోదుపై వ్యవసాయ, రెవెన్యు అధికాలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పంట నష్టం నమోదు చేసుకునే రైతు ఐదు ఎకరాల లోపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి టి.బాలాజి గంగాధర్, వీఆర్వోలు వీఏఏలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

పంట నష్టం అంచనా ప్రారంభం

వేమూరు: మండల వ్యవసాయశాఖ అధికారిణి సీహెచ్ సునీత మండల కేంద్రంలో తుపాను ధాటికి దెబ్బతిన్న పంట పొలాలను సోమవారం పరిశీలించి, రైతుల పేర్లు నమోదు చేసుకున్నారు. మండలంలోని 17గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కు అందజేత



రేపల్లె: నిజాంపట్నం మండలం తాళ్లతిప్ప గ్రామానికి చెందిన ఒడుగు పృథ్వీకుమార్ అనే వ్యక్తి ఇటీవల రహదారి ప్రమాదానికి గురై ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందాడు. బాధితుడికి ఆరోగ్యశ్రీ కార్డు లేకపోవటంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. బాధితుడికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు సీఎం రిలీఫ్ ఫండ్ రూ.10లక్షలను పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం అందజేశారు.

వ్యవసాయ విద్యార్థులకు అవగాహన



పిట్టలవానిపాలెం: బాపట్ల ఏరువాక కేంద్రం సహకారంతో మండలంలోని కనిగిరి వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఆర్బీకేలో ప్రభుత్వ కార్యాలయాలు, వ్యవసాయ భూమి విస్తీర్ణం. వివిధ పంట సాగు తదితర అంశాలను చిత్రపటాల రూపంలో వివరించారు. ఏఈఓలు సుదర్శనరావు, శివనాగేశ్వరి రైతులు ఉన్నారు.

భట్టిప్రోలు విద్యార్థికి రాష్ట్ర స్థాయి స్కాలర్‌షిప్



భట్టిప్రోలు: గుంటూరు చలపతి విద్యా సంస్థల ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కాలర్‌షిప్ అవార్డ్ పరీక్షల్లో స్థానిక విశ్వశాంతి హైస్కూల్ పదో తరగతి విద్యార్థి దొడ్డా ఇమ్మానియేల్ 23వ ర్యాంక్ సాధించాడు. విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు చేతుల మీదగా రూ.15 వేలు నగదు, సర్టిఫికెట్ అందుకున్నాడు. ఉపాధ్యాయులు బాలకృష్ణన్, సత్యేంద్ర ఫణి, ఫణి పార్థసారథి, అఖిల, జీవీఆర్ జ్యోతిర్మయి శిక్షణ ఇచ్చారు. సోమవారం కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు వారిని అభినందించారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



తెనాలిటౌన్: గుడివాడ సచివాలయంలో సోమవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని సెక్టార్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బ్యాలెట్ బాక్స్‌లు, మిషన్లు గురించి తెలియజేశారు. ఓటు వేసే విధానాన్ని చూపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ యడ్లపాటి రాకేష్, కోపల్లె ఎంపీటీసీ సభ్యులు కారుమంచి కిషోర్‌బాబు, వీఆర్వో హైమావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గీతా తత్వ బ్రహ్మాజ్ఞాన యజ్ఞం

భట్టిప్రోలు: మండలంలోని వెల్లటూరు గీతా జ్ఞాన మందిరంలో మంగళవారం కార్తిక బహుళ అమావాస్య పురస్కరించుకుని గీతా తత్వ బ్రహ్మజ్ఞాన యజ్ఞం జరుగుతుందని నిర్వహకురాలు వేములపల్లి వనజాక్షి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా గీతా ప్రచార మండలి జ్ఞానాశ్రమ అధిపతులు గీతా గురూజీ పందిరి శ్రీశైలం ఆధ్వర్యంలో కర్పూర యజ్ఞం జరుగుతుందని తెలిపారు. ఆస్థాన పండితులు వంగర చలమయ్య సిద్ధాంతితో శ్రీకృష్ణ పరమాత్మకు అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం కార్తిక వన సమారాధన జరుగుతుందని తెలిపారు.

పేదలకు అన్నదానం

భట్టిప్రోలు: స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో 1984–1985 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ప్రతి నెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆ బ్యాచ్‌కి చెందిన జంగం రవి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తమ బ్యాచ్ విద్యార్థులతో పాటు దాతలు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రైలు పేటలో 250 మందికి అన్నదానం చేశారు. అన్నదానానికి స్థానికులు నంబూరు వసంతరావు, మేరి దంపతులు స్థలాన్ని అందించినట్లు తెలిపారు.

త్రోబాల్ జిల్లా జట్టుకు యాజలి విద్యార్థిని ఎంపిక



యాజలి(కర్లపాలెం): రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు తమ పాఠశాల పదో తరగతి విద్యార్థిని ఎంపికైందని యాజలి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. సోమవారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు. హెచ్ఎం రమాదేవి మాట్లాడుతూ బాపట్లలో ఇటీవల జరిగిన మండల స్థాయిన త్రోబాల్ పోటీల్లో లక్ష్మీ తిరుపతమ్మ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైందన్నారు. ఈ నెల 12 నుంచి 14వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతనిధ్యం వహించనున్నట్లు చెప్పారు.

విశ్వ బ్రాహ్మణ సంఘం కార్తిక వన సమారాధన



భట్టిప్రోలు: స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సోమవారం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారిని భట్టిప్రోలు–అద్దేపల్లి విశ్వ బ్రాహ్మణ సంఘం తరపున వేమూరు నియోజకవర్గ కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడూరు వెంకటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు కడలి జగదీష్, వివిధ విభాగాల నాయకులు జి.ప్రభాకర్, జి.బ్రహ్మం, ఈ.హేమ సుందర్, విశ్వ బ్రాహ్మణ సంఘీయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక దీపోత్సవం


చక్కెర అభిషేకం అనంతరం రాజరాజ నరేంద్ర స్వామి


వెల్లటూరులో అగస్త్యేశ్వరునికి అన్నాభిషేకం


చినపరిమిలో రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

భట్టిప్రోలు: దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతీ సమేత విఠలేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక మాసం ఆఖరి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, దీపాలు వెలగించారు. అర్చకులు దండిబొట్ల ఛాయానాథ్ బాబు శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. ఈఓ దీవి అప్పలాచార్యులు పర్యవేక్షించారు.

దేవాలయాల్లో కార్తిక శోభ

వెల్లటూరు గ్రామంలో కొలువైన అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం చివరి సోమవారం ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సామూహిక సుమంగళి పూజలో మహిళలు పాల్గొన్నారు. రాత్రి స్వామికి శాంతి కల్యాణం, విశేష పూజలు చేశారు. ఈఓ దీవి వేంకటప్పలాచార్యులు పర్యవేక్షించారు. పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామికి నిత్య కల్యాణం, చక్కెర అభిషేకం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, ఈఓ మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు. వెల్లటూరులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో సామూహిక లక్ష బిల్వార్చన జరిగింది.

రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం

కార్తిక మాసం మాస శివరాత్రి పురస్కరించుకుని చుండూరు మండలం చినపరిమిలో కొలువైన రామలింగేశ్వరస్వామికి సోమవారం 108 కేజీల అన్నంతో అభిషేకం నిర్వహించారు. మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిపారు. అభిషేకం చేసిన అన్నంతో సాయంత్రం అన్న సంతర్పణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకులు మామిళ్ళపల్లి శ్రీనివాసరావు, సింగరపు వేణుమాధవ్, రవికుమార్, బీబీ శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు.

పుష్పయాగ మహేశ్వరునిగా రామలింగేశ్వర స్వామి

బాపట్ల అర్బన్ : స్థానిక ఎస్ఎస్‌పీ అగ్రహారంలోని గంగాపర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తిక మాసం సోమవారం ప్రాతఃకాల నిత్య విశేష అభిషేకం నిర్వహించారు. పుష్పయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. స్వామి వారు నూతన రజిత నాగాభరణ భూషితుడై 'శ్రీ పుష్పయాగ మహేశ్వరుని'గా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు గూడూరు చిట్టి బాబు, పంగులూరి కౌండిన్య, నెమలికంటి హనుమంత రావు, ఆలయ ధర్మకర్త ఆదూరి హరినారాయణ, కృష్ణభాస్కర్, యల్లాప్రగడ వెంకట రమణ సహకారం అందించారు. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.


రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విఠలేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం


రామలింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలంకరణ

వైభవంగా కార్తిక అఖండ దీపోత్సవాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని పలు ఆలయాల్లో అఖండ దీపోత్సవ కార్యక్రమాలు సోమవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. చినకూరగాయల మార్కెట్ సమీపంలోని సాయినాథుని ఆలయ ఆవరణంలో కర్పూరంతో అఖండ దీపోత్సవం నిర్వహించారు. గ్రామదేవత బూరుగులమ్మ ఆలయ ఆవరణంలో దీపోత్సవం, కర్పూరయజ్ఞం నిర్వహించారు. చోడాయపాలెంలో కొలువుదీరిన చోడేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తిక మాస పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామికి బంగారపు పొడితో కనకాభిషేకం, 15కిలోల విభూదితో భస్మాభిషేకం, నవరత్నాలతో రత్నాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. మోర్తోట ముక్తేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


సాయినాథుని ఆలయంలో అఖండ దీపోత్సవం


బూరుగులమ్మ ఆలయంలో దీపాలంకరణ

'స్పందన'కు 9 అర్జీలు

రేపల్లె రూరల్: స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు అందినట్లు ఆర్డీవో హేలా షారోన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. రేపల్లె మండలం కారుమూరు ఎస్టీ కాలనీలో చేరిన డ్రెయినేజ్ నీరు తొలగింపునకు, పెనుమూడిలో అర్హులకు నివేశన స్థలాలు అందించాలని, సాగుభూమిని ఆన్‌లైన్ చేసి అడంగల్‌లో ఎక్కించాలని సింగుపాలెం నుంచి, నగరం మండలం పూడివాడ నుంచి ఇదే సమస్యపై రెండు అర్జీలు వచ్చాయన్నారు. నల్లూరుపాలెం, విశ్వేశ్వరం, సింగుపాలెం, బొబ్బర్లంక, పోటుమెరక గ్రామాల్లో ప్రభుత్వ పోరంబోకు భూమిని సాగుచేసుకుంటున్న రైతులకు పంట నష్ట పరిహారం అందజేయాలని అర్జీ అందిందన్నారు. చావలి గ్రామంలో రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ఒకటి, వేమూరు మండలం వరాహపురం గ్రామంలో దివ్య మహిళా గ్రూపునకు సున్నా వడ్డీ పథకం వర్తింపజేయాలని అర్జీ అందగా, భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి సంబంధించిన అసైన్డ్ భూమిని హక్కుదారులకు అప్పగించాలని ఒక అర్జీ అందిందన్నారు. ఫిర్యాదులను పరిశీలించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు అర్జీలను బదిలీచేస్తామని ఆర్డీఓ చెప్పారు.


ఆర్డీవో హేలా షారోన్‌కు అర్జీలను అందజేస్తున్న ప్రజలు

దళితునిపై దాడి ఖండన

వేమూరు: తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వస్తే దళితులపై దాడులు అధికమవుతాయని దళిత సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. తుపాను ప్రభావిత ప్రాంతాలైన అమర్తలూరు మండలంలోని కూచిపూడి, అమర్తలూరు గ్రామాల్లో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు పర్యటించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కూచిపూడి లాకుల వద్ద మూల్పూరు గ్రామానికి చెందిన ఘంటా సాయి అనే వ్యక్తి ద్విచక్ర వాహనం, ట్రాక్టరుతో హల్‌చల్ చేసినట్లు తెలిపారు. అదే గ్రామంలోని టీడీపీకి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఐమల మార్తమ్మ కుమారుడు ప్రమోద్ కుమార్ వారించడంతో అతనిపై ఇష్టానుసారంగా దాడి చేయడాన్ని ఖండించారు. మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు దళితుడిపై జరిగిన దాడిని ఇంతవరకు ఖండించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో యల్లమాటి మోహన్, దున్నా మేరీసుబాబు, దొప్పలపూడి జ్యోతిబాబు, దాసరి యాకోబు పాల్గొన్నారు.

నేడు అయ్యప్పస్వామి నగరోత్సవం

బాపట్ల అర్బన్: స్థానిక సోమేశ్వరస్వామి దేవస్థానం నుంచి మంగళవారం సాయంత్రం 5 గంటలకు అయ్యప్పస్వామి నగరోత్సవం నిర్వహించనున్నట్లు దేవస్థానం మేనేజ్‌మెంట్ గురుస్వామి రామగిరి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరోత్సవంలో అయ్యప్ప భక్తులు, దీక్షాపరులు, నగర ప్రజలు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

యువతి అదృశ్యం

తెనాలిరూరల్: ఇంటి వద్దే ఉంటున్న యువతి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గురవయ్య కాలనీకి చెందిన 20 ఏళ్ల శిరీష 8వ తరగతి వరకు చదివి, ఇంటి వద్దే ఉంటోంది. ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు సోమవారం రాత్రి తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

తెనాలిరూరల్: కట్నం వేధింపులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన వేజండ్ల కల్యాణి తన భర్త రామారావు అదనపు కట్నం కోసం మానసిక, శారీరక వేధింపులకు గురి చేస్తున్నాడని పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు సోమవారం రాత్రి తెలిపారు.

రౌడీషీటర్ మృతి

గుంటూరు ఈస్ట్: రౌడీషీటర్ మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనివాసరావుపేటలో నివసించే రౌడీషీటర్ షేక్ చాంద్‌బాషా (45) కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం నగరంపాలెం ఐసీఐసీఐ బ్యాంకు వద్ద మృతి చెంది పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వారు చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్‌లోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో విద్యార్థుల ప్రతిభ

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీవేంకటేశ్వర బాలకుటీర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి లలిత కళా ఉత్సవంలో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ కీబోర్డు పోటీలో 9వ తరగతి విద్యార్థి పి. నందకిషోర్, తాళ వాయిద్య పోటీలో 8వ తరగతి విద్యార్థి టి. బోస్ అనుదీప్ ద్వితీయ బహుమతులు గెలుపొందినట్లు వివరించారు. విద్యతో పాటు సంగీత, సాహిత్య కళల్లో మేటిగా అన్ని రంగాల్లో రాణించే విధంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తీర్చిదిద్దిన సంగీత విద్వాంసుడు నెమలి రాంబాబును ప్రశంసించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ పాలేటి తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



బాపట్ల: గ్రీన్ పీస్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు మండలంలోని వెదుళ్లపల్లి గిరిజన కాలనీలో సోమవారం నిత్యావసర సరుకులు, భోజనం పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ పిన్నిబోయిన ఏసురత్నం మాట్లాడుతూ తుపాను కారణంగా జీవనం కోల్పోయిన గిరిజన కాలనీ వాసులకు భోజనం, నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. దాతలు ముందుకొచ్చి ఈ కాలనీ వాసులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు డానియేల్, అంకమ్మరావు, నాగరాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.